# 74. 'టీ' సెక్షన్ వివరాలు

నేను పనిచేసే కంపెనీకి ఒక గవర్నమెంట్ ఆఫీసులో ఒకానొక సెక్షన్‌తో ఇంచుమించు రోజూ ఏదో పని ఉండేటంత అనుబంధం. నాకు మా కంపెనీలో నీడ పట్టున చేసేపని (ఉద్యోగం) ఉన్నన్నాళ్లూ ఆ గవర్నమెంట్ ఆఫీసు తూర్పున ఉందో పడమటని ఉందో నాకు తెలియలేదు. కాని ఎగ్జిక్యూటివ్‌గా మారిన రోజు నుంచీ ఆ ఆఫీసు ఏ దిక్కున ఉందో మాత్రమే కాక, అక్కడికి నడిచి వెళ్తే ఎంతసేపు పడుతుంది, సైకిలు మీద వెళ్తే ఎంత ఆయాసం వస్తుంది, స్కూటర్‌మీద అక్కడిదాకా లిఫ్ట్ అడిగితే ఎన్ని కష్టాశ్రువులు రాల్తాయి, ఆ ఆఫీసులో స్టాఫ్ ఎందరు, కిటికీ లెన్ని, దూలాలు ఎన్ని - వంటి వివరాలు ఎన్నో అనుభవైక వేద్యం అయి కూర్చున్నాయి.

ఆ ఆఫీసులో మా కంపెనీ పన్లు హెడ్ గుమస్తా లెవెల్లోనే అయిపోయేటంత చిన్నవి. ఐనా తరుచు వెళ్లవలసి రావడం, వెళ్లినప్పుడల్లా హెడ్ గుమస్తా గారైన టీ టీ రావు గారి దగ్గిర కూర్చోవలసి రావడం జరిగి ఆయనతోనే ఎక్కువ పరిచయం అన్న స్థితికొచ్చింది నా వ్యవహారం. అంత పరిచయం కలిగినా, ఆయన పూర్తి పేరు తిరుపతి రావనీ, ఇంటిపేరు తంబళ్ల అనీ నాకు స్ఫురించదు. టీటీ రావు అంటేనే బాగా తెలుస్తుంది.

టీటీ రావు గారు సార్థక నామధేయులు. రెండు శ్రీలు ధరించిన మహాకవి లాగ రెండు టీలు ధరించిన వాడీయన. కుడిచేత్తో ఒక "టీ", ఎడంచేత్తో ఒక "టీ" ఫైళ్లు తిరగెయ్యడమే కాక రెండు చేతుల్తోనూ రెండు "టీ" లు పట్టుకుని తాగ గల సమర్థుడాయన.

"అరగంటకోసారి టీ తాగుతారు కదా. రావుగారూ, దీనివల్ల మీ ఆరోగ్యం దెబ్బతినదుటండీ?" అని ఒకసారి ఆయన్ని అడిగాను.

"కాఫీ, టీ మొదలగునవి మత్తు పదార్థములు. వీనిని సేవించిన వారు తాత్కాలిక ఉత్సాహము పొందిననూ క్రమముగా ఇవి ఆరోగ్యమునకు హాని చేయును - అని మా చిన్నప్పుడు టెక్స్ట్ పుస్తకాల్లో వుండేది. ఇది కొన్నాళ్లకి మారిపోయింది. బ్రాందీ, విస్కీ మొదలగునవి మత్తు పదార్థములు - అని ఇప్పటి పాఠం. మొదటివి బెవరేజెస్ అని గౌరవంగా చెప్పుకునే పానీయాలయ్యేయి. ఆ తరవాతవి "మందు" లయ్యాయి. ఇప్పటివి "డ్రగ్స్". వీటి పేర్లలో వచ్చిన పరిణామం వల్ల మనం ఎంతగా ప్రగతిపథంలో పయనిస్తున్నామో తెలుసు కోవచ్చు" అని టీటీరావు గారు ఒక లఘు ప్రసంగం నాకు కటాక్షించేరు.

ఉదయం లేవగానే (కొండొకచో దంతధావనం చెయ్యకుండానే) "కాఫీ" తాగే వాళ్లు ఎక్కువ శాతంలో ఉన్న దక్షిణ భారత దేశంలో కూడా "టీ" ఎంతో గాఢమైన అలవాటై పోయిందిట. "టీ" -వీ- ద్వారా హిందీ మన నెత్తినెక్కి కూర్చున్నట్టు "టీ" ద్వారా ఔత్తరాహ సంస్కృతి మనలో నరనరాలా వ్యాపిస్తోందట - టీటీ రావు గారే చెప్పేరు.

ఆ ఆఫీసులో అందరూ ఉదయం తొమ్మిదిన్నరకి రావాలి. కాని పావుగంట గ్రేస్ పీరియడ్ వుంది. ఇదికాక టీటీరావు గారు స్వప్రయోజనార్థం ఇచ్చేది మరో అయిదు నిమిషాలు. 9-45కి అటెండెన్స్ రిజిస్టరు క్లోజ్ చెయ్యడు. 9-45 కీ 9-50 కీ మధ్య వచ్చేవారు అక్కడి పదహారు మంది

ఉద్యోగుల్లో ఆరుగురు తేల్తారు. ఈ ఆరుగురూ (అరగంట కొకరు చొప్పున) లంచి టైమ్ వరకు టీటీ రావుగారి కొక "టీ" తమ కొక"టీ" రప్పించుకుంటారు.

టైమ్ ప్రకారం డ్యూ'టీ'కి రాకపోవడం అలవాటు ఎలాగో, చివరిదాకా ఉండలేకపోవడం కూడా అలాగే అలవాటుంటుంది, ఏ ఆఫీసులో అయినాసరే. "ఏమిటయ్యా, నీ ధోరణి? ఆఫీసుకి రావడంలో ప్రతిరోజూ లేటేనా?" అని అడిగితే "దానికి పరిహారంగా ప్రతిరోలూ వేగిరం వెళిపోతున్నాను కదండీ!" అని వచ్చిన జవాబు వందలకొద్దీ ఏళ్లనాటిదే నంటారు. ఇలా 4-30 కి వెళిపోవలసిన వాళ్లలో కొందరు 3-30కే వెళ్లాలని ఉద్దేశిస్తే ఆ పదహారు మందిలో రోజుకి నలుగురు తేల్తారు కదా. వాళ్లు నలుగురూ మధ్యాన్నం రెండున్నర నుండి నాలుగున్నర వరకూ టీ సప్లయి సంగతి చూసుకుంటారు.

శ్టాఫ్‌లో ఎవరైనా కొత్తవస్తువులు కొనుక్కుంటారు. "టీ"వీ, స్కూటరూ, లాంటి భారీ ఖర్చు వస్తువులనుండి వాచీ, గుడ్డలు, చెప్పులు లాంటి నిత్యావసర వస్తువుల వరకూ ఎవరు ఏది కొనుక్కున్నా పక్క (సీట్లో) వాడే బల్లెంగా మారి అందరి మధ్యా ఎనౌన్స్‌మెంటు చేసి 'టీ' అభిషేకంతో శాంతి చేయిస్తాడు. "పాపారావు కళ్లజోడు ఫ్రేం మార్పించేడు చూసేరా? పోతేపోయింది గాని గురుడికి ఒక ఎగ్జిక్యూటివ్ లుక్ వచ్చింది! ఏమంటావు పాపారావ్?" అని ఒకడంటాడు. దాంతో "పదీ బై పదిహేడు" టీ రావలిసిందే. (నాకూ టీ టీ రావు గారికీ ఫుల్ టీ లు రెండు. మిగతా పదహారు మందికీ ఎనిమిది) అనూరాధనీ అన్నపూర్ణనీ కూడా వదలరు. "అనూరాధ గారు కొత్త చీరలో ఆఫీసుకే కళ తెచ్చేరు."....."అన్నపూర్ణగారూ, మీ పుస్తెల తాడుకి ఇరవైగ్రాముల బంగారం పట్టిందనుకుంటాను!" అంటూ కనబడినంతవరకు చూసి మెచ్చుకుని "టీ"మ్ వర్కు చేసే కొంటెవాళ్లు కూడా ఉన్నారక్కడ.

పిల్లలు పుట్టడం, వాళ్లకి కాన్వెంటు నుంచి కాలేజీ వరకూ ఎందులోనో సీటు దొరకడం, పాసవడం, క్లాసు రావడం, ప్రయిజులూ, రేడియోలో "శ్రోతల ఉత్తరాలు" శీర్షికలో పేరు చెప్పడం, కాదేదీ "టీ"కి అనర్హం.

నా సంగతి సరేసరి. కాని ఆ ఆఫీసులో చిన్న, పెద్ద పనులు చేయించుకోడానికి వచ్చే "పార్టీలను" టీతో వదలరు. వక్కపొడి పొట్లాలు, సిగరెట్లూ కూడా ఆయా పార్టీల అకౌంటులో వచ్చి పడతాయి.

ఒకసారి నేను టీటీ రావు గారి దగ్గిర కూర్చుని ఉండగా వాళ్ల ఎం.డి. గారి పి.ఏ. వచ్చేరు. "సోములూ, టీ!" అని టీ టీ రావుగారే స్వయంగా డబ్బులిచ్చి పంపేరు. ఆ పి.ఏ. గారు "ఎందుకు సార్, ఇప్పుడు అనవసరంగా టీ?" అని మెలికలు తిరిగిపోయాడు. "ఇంట్లో అలవాటు!" అన్నారు రావుగారు "షార్ప్" గా. "ఇంట్లో అలవాటా?" అన్నాడాయన. "అదేనయ్యా. ఇంట్లో అంతే. పాల్రాగానే టీ తాగుతాం. ఇప్పుడొచ్చింది పాలే కదా!" అని టీ టీ రావు గారు నవ్వేరు (ఆ పి.ఏ. గారి పేరు పాల్: అని అప్పుడు తెలిసిందినాకు.)

ఆయన రిటైరైన నాడు ఏర్పాటైన "టీ" పార్టీకి నేనూ వెళ్లాను. "రేపట్నుంచీ టీ టీ రావు గారు వట్టిరావు గారైపోతారు కాబోలు." అన్నాను.

"లేదు. మా సెక్షనుకి సెపరేట్ కాంటీన్ కావాలని నోటు పెట్టాం. శాంక్షనైంది. ఆ కాంట్రాక్టు టీ టీ రావు గారికే వచ్చింది." అని ఒకాయన నా చెవిలోచెప్పారు.

★